నేడు గ్రీవెన్స్ రద్దు

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 15 : ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులలో అధికారులు నిమగ్నమై ఉన్నందున గ్రీవెన్స్ డేను రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు గమనించి నూతన కలెక్టరేట్ గ్రీవెన్స్ విషయమై రావద్దని పేర్కొన్నారు.

అండర్-16 క్రికెట్ జట్టులోకి 'పాలెం' యువకుడు

ఎంపికైన మణికంఠ

రఘునాథపాలెం, అక్టోబర్ 15 : హైదరాబాద్ క్రికెట్ అసోసియోషన్ ఆధ్వర్యంలో అండర్-16 క్రికెట్ జట్టు ఎంపికల్లో ఖమ్మం జిల్లా యువకులకు అవకాశం దక్కింది. రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామానికి చెందిన పొట్లపల్లి నాగరాజు కుమారుడు మణికంఠ, రఘునాథపాలెం సీఐ కోటగిరి శ్రీధర్ కుమారుడు శ్రీకర్ ఉన్నారు. మణికంఠ హైదరాబాద్‌లో, శ్రీకర్ ఖమ్మంలో 10వ తరగతి చదువుతున్నారు. క్రికెట్ జట్టులో జిల్లా యువకులకు అవకాశం లభించడం పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు ఆరుగురు చొప్పున ఆరు జట్లకు 66మందిని ఎంపిక చేయగా వేపకుంట్ల, ఖమ్మం నగరం నుంచి ఇద్దరికి అవకాశం దక్కింది.

అబ్దుల్ కలాంకు కార్పొరేటర్ మక్బుల్ నివాళులు

కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ మక్బుల్

ఖమ్మం, అక్టోబర్ 15 : ది మిస్సయిల్ మ్యాన్ అఫ్ ఇండియా, భారత దేశ 11వ రాష్ట్రపతి, భారత రత్న ఏపీజే అబ్దుల్ కలాం 92వ జయంతి సందర్భంగా 23వ డివిజన్ కార్పొరేటర్ షేక్ మక్బూల్ ముస్తఫానగర్ సెంటర్‌లోని అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మక్బూల్‌తో పాటు డివిజన్ అధ్యక్షుడు షేక్ ఇలియాజ్ పాషా, కార్యదర్శి జీవీవీఎల్ నర్సింహారావు, డివిజన్ నాయకులు సలీమ్, లాలా, అజ్జు, ముజ్జుబాయ్, కరీముల్లా, మొహమ్మద్ అలీ, జాఖీర్ పాల్గొన్నారు.

విన్‌ఫీల్డ్‌కు 'ఎక్సెలెన్సీ' అవార్డు

అవార్డును అందజేస్తున్న నిర్వాహకులు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 15 : నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలకు 'ఎక్స్‌లెంట్ లీడర్‌షిప్ అకడమిక్ ఆఫ్ అవుట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్' అవార్డును అందజేసినట్లు పాఠశాల చైర్మన్ మన్నె కిషోర్‌కుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్-2023ల్ అవార్డ్స్ సంస్థ నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో అవార్డును అందుకున్నారు. స్టేట్‌లో ఉత్తమ పాఠశాలగా అవార్డును అందించారన్నారు. అవార్డు రావడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం ఉందని డైరెక్టర్ పోలవరపు శ్రీకాంత్, గద్దె పుల్లారావు పేర్కొన్నారు.

అభ్యాసన సీబీఎస్ఈకి బెస్ట్ స్కూల్ అవార్డు

అవార్డును అందజేస్తున్న నిర్వాహకులు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 15 : జిల్లాలో అత్యున్నతమైన నాణ్యత గల విద్య అందిస్తున్న అభ్యాసన సీబీఎస్ఈ స్కూల్‌కి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డును అందజేశారని డైరెక్టర్ గొల్లపూడి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఎక్సెలెంట్ లీడర్‌షిప్, ఔట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ అవార్డును అందజేశారు. విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన విద్యను అందించడం పట్ల అవార్డు లభించిందని రాంప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ నాగేంద్రకుమార్, చైతన్య పాల్గొన్నారు.

కొలువుదీరిన 'దుర్గమ్మ'

మండపాల్లో ప్రత్యేక పూజలు ఊరూరా ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు

పాండురంగాపురంలో దుర్గమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

రఘునాథపాలెం, అక్టోబర్ 15 : ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల్లో దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో అలంకరించిన మండపాల్లో దురార్గాదేవి ప్రతిమలు కొలువుదీరాయి. మండపాల్లో ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని పాండురంగాపురం, వీ వెంకటాయపాలెం, బల్లేపల్లి, ఖానాపురం, ఎల్వీనగర్, రోటరీనగర్, రఘునాథపాలెం, చింతగుర్తి, మంచుకొండ గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహాలను నెలకొల్పి పూజలు ప్రారంభించారు. పాండురంగాపురం శ్రీరామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో నవరాత్రుల సందర్భంగా విద్యుత్ కాంతులతో మిరిమిట్లు గొలుపుతోంది. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, బత్తిని ఉపేందర్, ఉపాధ్యక్షుడు కుర్రా మాధవరావు, కోశాధికారి శీలం శ్రీను, సహాయకార్యదర్శి జీ గోపి, గౌరవాధ్యక్షులు మలీదు వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారు యలగందుల సత్యనారాయణ, ముక్కపాటి శ్రీను, బోయిన సురేశ్, కేబుల్ వీరన్న, పంపుల శ్రీను, చిర్రా రాంబాబు, లింగయ్య, హతీరాం, గ్రామ పెద్దలు డేగల ఉపేందర్, జీ భద్రయ్య, ఆలయ అర్చకులు అంబడిపూడి రవిశర్మ, తౌటం వేణుశర్మ తదితరులు పాల్గొన్నారు. వీ వెంకటాయపాలెం రామాలయంలో బతుకమ్మ, శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

గోపూజ చేస్తున్న మేళ్లచెర్వు

ఖమ్మం, అక్టోబర్ 15 : అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గుట్టలబజారు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో నాదనీరాజనం, గోపూజ, ఆలయ ప్రదక్షిణ, గణపతి పూజ, పుణ్యాహవచనము, సుప్రభాతసేవ, యాగ సంకల్పము, పంచగవ్య ప్రాశన, రక్షాబంధనధారణ, దీక్షాధారణ, ఋత్విక్ వరుణలు, యాగశాలార్చనలు, చతుషష్టియోగినీ, వాస్తు, క్షేత్రపాలక నవగ్రహసర్వతో భద్రమండప పూర్వక నక్షత్ర మూలదేవతా ఆరాధనలు, ప్రధాన కలశస్థాపన, అఖండ దీపారాధన, కోవెల సేవ, మాలాధారణ, మృత్సంగ్రహణ తీర్థ, అగ్నిమధనము, కుండ సంస్కారము, అగ్నిప్రతిష్టాపన, అవతారమూర్తి సహిత మూల మంత్ర దేవతా హోమములు, ఆజ్యపూర్ణాహుతి, రారోపణ, ధ్వజారోహణ, బలిహరణలు, అగ్నిమధనము, కుండ సంస్కారము, అగ్నిప్రతిష్టాపన, అవతారమూర్తి సహిత మూలమంత్ర దేవతా హోమములు, ఆజ్యపూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారని ఆలయ కమిటీ అధ్యక్షుడు మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దేవత అనిల్ కుమార్, కోశాధికారి కొత్తమాసు హేమసుందర్రావు, సహాయ కార్యదర్శులు చెరుకూరి శ్రీనివాసరావు, అనుమోలు రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ

భారీగా హాజరైన మాలధారులు, నగర ప్రజలు

మెట్లపూజ కార్యక్రమంలో గురుస్వాములు

స్వామికి అభిషేకం చేస్తున్న గురుస్వాములు

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 15 : నగరంలోని శ్రీనివాసకాలనీలో ఆదివారం అయ్యప్ప మహాపడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వర్తక సంఘం ఉపాధ్యక్షుడు సోమ నర్సింహారావు(జీవై నరేశ్) గురుస్వామి ఇంటవద్ద భారీ సెట్టింగ్‌లు, వివిధ దేవుళ్లకు సంబంధించి తాత్కాలిక దేవాలయాలు నగరవాసులను ఎంతో అకర్షించాయి. శరణం, శరణం, స్వామి శరణం, అయ్యప్ప శరణం అంటూ మాలాధారులు గంటల పాటు భజన నిర్వహించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, కార్పొరేటర్ రుద్రగాని శ్రీదేవి, వర్తక సంఘం వ్యాపారులు సతీశ్, పాలవరపు కోటేశ్వరరావు, ముత్యం ఉప్పలరావుతో పాటు ఆయా శాఖల బాధ్యులు స్వామి వారి వద్ద ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అయ్యప్ప భక్తులు, మాలాదారులకు అన్నదానం (మహాభిక్ష) చేశారు.

సత్తుపల్లి బస్టాండ్‌లో 12 తులాల బంగారం చోరీ

సత్తుపల్లి రూరల్, అక్టోబర్ 15 : సత్తుపల్లి బస్టాండ్‌లో ఓ మహిళ బస్సు ఎక్కుతుండగా 12తులాల బంగారం చోరీ అయిన సంఘటన ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్సై కృష్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నుంచి కోటగిరి అనిత అనే మహిళ సత్తుపల్లి బస్టాండ్‌లో ఉదయం 11.40 గంటలకు బస్సు దిగింది. తన బంధువులు ఖమ్మం నుంచి రావాల్సి ఉండగా వారి కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. వారు వచ్చిన తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం తాటి సుబ్బన్నగూడెం వెళ్లేందుకు అశ్వారావుపేట బస్సు ఎక్కారు. బస్సు ఎక్కే క్రమంలో ఎక్కువ రద్దీ ఉండడంతో మహిళలు ముందుకు వెళ్లాలని సూచించడంతో బస్సు ఎక్కిన తర్వాత సీటు కోసం చూస్తున్న క్రమంలో హ్యాండ్‌బ్యాగ్ జిప్ తీసి ఉండటాన్ని గమనించింది. బ్యాగులో ఉన్న బంగారం బాక్సు చోరీకి గురైనట్లు తెలుసుకుని రోధిస్తూ బస్సు సిబ్బందికి విషయాన్ని తెలిపింది. వెంటనే సిబ్బంది బస్సును స్టేషన్‌కు తరలించి తనిఖీలు నిర్వహించారు. ఎవరి వద్ద బంగారం కినిపంచకపోవడంతో అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లేబో టోమిస్ట్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం, అక్టోబర్ 15 : సీఎస్‌సీ హెల్త్ కేర్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలలో పనిచేయడానికి ప్లేబో టోమిస్ట్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీఎస్‌సీ హెల్త్ కేర్ ఖమ్మం, నల్గొండ డివిజనల్ మేనేజర్ వై.ఎస్.ఆర్.ప్రసాద్, ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ తేజవత్ ప్రవీణ్ కుమార్ సంయుక్తంగా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీ అనుభవం, మేల్ నర్సింగ్‌లో ప్రెషర్స్ అయ్యి ఉండాలని చెప్పారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 17న ఖమ్మంలోని రాపర్తినగర్‌లో ఉన్న సీఎస్‌సీ సెంటర్ నందు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగే ఇంటర్వ్యూలో పాల్గొనాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 91777 07829, 95504 39357 నెంబర్లను సంప్రదించాలని కోరారు.